
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 3 । జూలై । 2025



సోమశిలలో 31.357 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారానికి 31.357 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,280, ఉత్తర, దక్షిణ కాలువలకు 1275 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,00,350
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,065
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,337
సవర (8 గ్రాములు)	రూ.74,696

గరిష్ఠం/కనిష్ఠం 33.7/29.0

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం. బుధవారం గాలిలో తేమ 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

‘సుపరిపాలన’కు ఎమ్మెల్యేల డుమ్మా

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం ఏడాది ‘సుపరిపాలనకు తొలిఅడుగు’ కార్యక్రమానికి తొలిరోజు బుధవారం జిల్లాలో మొక్కుబడిగా జరిగింది. నెల్లూరు సిటీలో మంత్రి నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కోవూరులో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తమ నియోజకవర్గాల్లో, కావలిలో దగుమాటి కృష్ణారెడ్డి పట్టుమని పది ఇళ్లు కూడా తిరగకుండానే మొక్కుబడిగా నిర్వహించి మమ అనిపించారు. ఉదయగిరి, కందుకూరు ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు విదేశాలకు చెక్కేశారు. స్థానికంగా ఉన్నప్పటికీ సర్వేపల్లి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసలు కార్యక్రమాన్నే ప్రారంభించలేదు.


అర్ధరాత్రి దర్గా కూల్చేశారు



దర్గా కూల్చివేత ఫొటోలు చూపుతున్న కమిటీ సభ్యులు

నెల్లూరు రూరల్: నెల్లూరు వెంకటేశ్వరపురంలోని మస్తానీ అమ్మవారి దర్గాను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా ఇంజినీరింగ్ అధికారులు గత నెల 30వ తేదీ రాత్రికి రాత్రే కూల్చివేశారని కమిటీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కమిటీ సభ్యులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మస్తానీ అమ్మవారి దర్గాలో గత 40 సంవత్సరాల నుంచి నిత్యం పూజలు చేస్తూ సేవ చేసుకునే వారమని తెలిపారు. ఈ దర్గా 15 అంకణాల స్థలంలో ప్రభుత్వం మంజూరు చేసిన పట్టా కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముక్తియార్, సాజిదా, దస్తగిరి యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ మాధవి



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ కె.మాధవి

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) సూపరింటెండెంట్‌గా (ఎఫ్ఏసీ) బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ కె.మాధవిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నియమించింది. ఆమె బుధవారం ఆస్పత్రిలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గాను, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గాను బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె కళాశాలలో సౌమ్యురాలిగా, నిజాయితీ గల అధికారిణిగా పేరు తెచ్చుకున్నారు. విశ్రాంత సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధానాయక్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్‌బాషా, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి అండగా ఉంటాం

- కరేడులో వామపక్ష నేతల పర్యటన



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఉలవపాడు: భూ సేకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కరేడు గ్రామ రైతులకు వామపక్ష పార్టీలు అండగా ఉంటాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వంకాయలపాటి శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కేవీ ప్రసాద్ అన్నారు. వామపక్ష పార్టీలు, అనుబంధ ప్రజాసంఘాల నాయకులు కరేడు పంచాయితీ పరిధిలోని రామకృష్ణపురం, ఉప్పరపాళెం, అలగాయపాళెం, కరేడు, పొట్టేళ్లగుంటలో బుధవారం వారు పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, గ్రామసభ నిర్వహించకుండా భూ సేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం చట్టవిరుద్ధమన్నారు. మూడు పంటలు పండే పచ్చని భూములు కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం వెనుక కుట్ర ఉందన్నారు. గతంలో ఇదే కంపెనీకి భూములు ఇస్తుంటే ఇష్టం వచ్చినట్లు మాట్లాడిన చంద్రబాబు ఇప్పుడు అదే కంపెనీకి 8,348 ఎకరాలు కేటాయించడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. గత నెల 29న జరిగిన రాస్తారోకోలో పోలీసులను తోసివేసి రోడ్డెక్కిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా కరేడు రైతుల పోరాట పటిమను తెలియ చేసిందన్నారు. వరి, మామిడి, సపోట, వేరుశనగ, కూరగాయలు పండించే రైతుల భూమిని తీసుకోవడానికి ఒప్పుకోమన్నారు. సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్రామాల్యాద్రి, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, రైతు సంఘం ప్రకాశంజిల్లా కార్యదర్శి హనుమారెడ్డి, సీపీఐ ఎంఎల్ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సాగర్, పీఓడబ్ల్యూ నాయకురాలు పద్మ, ఈసీసీఐ నాయకులు ఆనంద్, ఆర్‌యస్‌పీ నాయకులు సురేష్, సీపీయం నాయకులు కుమార్ పాల్గొన్నారు.

ఈ ఫొటో చూడండి. ఇది సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలంలోని విరువూరు ఇసుక రీచ్. ప్రస్తుతం పెన్నానదిలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. అధికార మదంతో వ్యవహరిస్తున్న తెలుగు తమ్ముళ్లు పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ ఎన్‌జీటీ ఆదేశాలనే ధిక్కరించి రాత్రి వేళల్లో భారీ యంత్రం పెట్టి టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారు. బహిరంగంగా ఇసుక దోపిడీ చేస్తున్నా.. ఏ శాఖ అధికారి కూడా పట్టించుకోడు. నిత్యం నీతులు వల్లిస్తూ ప్రతిపక్షనేతలపై తప్పుడు కేసులు పెట్టించి జైల్లో పెట్టించిన వారికి మాత్రం ఈ దోపిడీ కన్పించదు.



విరువూరు రీచ్‌లో రాత్రి వేళ యంత్రాలు పెట్టి లోడింగ్

కోవూరు నియోజకవర్గం పోతిరెడ్డిపాలెంలో డీసిల్టింగ్ పేరుతో యథేచ్ఛగా ఇసుక దోపిడీ సాగుతోంది. నేరుగా పెన్నానదిలో యంత్రాలను పెట్టి లోడింగ్ చేస్తున్నారు. పగటి సమయాల్లో షుగర్ ఫ్యాక్టరీ వద్ద లోడింగ్ చేస్తున్నట్లు చూపిస్తూ రాత్రివేళ యంత్రాలతో నేరుగా నదిలోనే టిప్పర్లకు, ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్నారు. నిత్యం వెయ్యి టన్నుల ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం. పగలు రవాణాతో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక తరిగిపోతున్న, తిరిగి తెల్లారే సరికి మళ్లీ ఫుల్ చేస్తున్నారు.



కోవూరు సమీపంలోని పోతిరెడ్డిపాలెంలో ఇసుక డంపింగ్



రాత్రిళ్లు తోడేస్తున్న ఇసుక తోడేళ్లు

నిషేధమున్నా తగ్గేదేలే అంటున్న తమ్ముళ్లు

- పోతిరెడ్డిపాళెం, మినగల్లులో ఆగని ఇసుకదందా
- పొట్టేపాళెం, జనార్దన్‌రెడ్డికాలనీ నుంచి అక్రమ రవాణా
- కలువాయిలో బహిరంగంగా పెన్న గుల్ల
- జేబులు నింపుకుంటున్న తమ్ముళ్లు
- కళ్ల ముందే ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా పట్టించుకోని అధికారులు

కలువాయి మండలం రాజుపాళెం వద్ద రీచ్‌లోకి నిర్మిస్తున్న రోడ్డు



సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో పెన్నానదిలో ఇసుక తవ్వకాలపై నిషేధాంక్షలు ఉన్నా.. తెలుగు తమ్ముళ్లు లెక్క చేయడం లేదు. కొన్ని చోట్ల పగలు సైతం రీచ్‌ల నుంచి ఇసుక తోడేస్తుంటే.. మరి కొన్ని చోట్ల రాత్రిళ్లు విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తూ ఇసుక అక్రమ దందాకు తెర తీస్తున్నారు. తమ జేబులు నింపుకోవడమే పరమావధిగా పర్యావరణాన్ని పణంగా పెట్టి భారీ స్థాయిలో గోతులుగా తవ్వేసి ఇసుక తోడేస్తున్నారు. పెన్నానదిలోకి చూస్తే ఎక్కడిక్కడ లోయల మాదిరిగా కనిపిస్తోంది. నిత్యం మీడియా అక్రమ రవాణాపై ఫొటోలతో సహా వెలుగులోకి తెస్తోంది. బండి వెనుక బండి కట్టి.. అన్నట్లు ఇసుక రవాణా చేసే ట్రాక్టర్లు, టిప్పర్లు, భారీ లారీలు దండుగా రీచ్‌ల నుంచి వెళ్తున్నా.. సంబంధిత అధికారులకు మాత్రం కంటికి కనిపించడం లేదు. టీడీపీ నేతలు ఇచ్చే నెలవారీ మామూళ్లు తీసుకుంటూ ఇసుక్ర అక్రమాలకు సాగిలపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డీసిల్టింగ్ పాయింట్లలో నేరుగా యంత్రాలతో తవ్వుతున్నా.. స్టాక్ పాయింట్లలో ఉండాల్సిన ఇసుక నిల్వలు కనిపించకపోయినా.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తమ్ముళ్లు జేబులు నింపుకుంటున్నా.. ఎన్‌జీటీ ఆదేశాలను ధిక్కరించి ఇసుక ఓపెన్ రీచ్‌ల్లో బహిరంగంగానే యంత్రాలతో తవ్వేస్తూ పెన్నమ్మ గర్భాన్ని చీల్చేస్తున్నా.. ఈ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్రభుత్వం మారింతే భవిష్యత్‌లో ఇసుక దోపిడీపై ఎలాంటి కేసులు ఎదుర్కోవాల్సి వస్తోందో వేచి చూడాల్సి ఉంది.

నిబంధనలు కాలరాసి..

పూడిక తీత ద్వారా ఇసుక బయటకు తీసుకొచ్చి వినియోగదారులకు విక్రయించేందుకు అనుమతి పొందిన షిప్పింగ్ సొసైటీ నిర్వాహకులు అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. నదిలోనే యంత్రాలు పెట్టి టిప్పర్లకు ఇసుక లోడింగ్ చేస్తున్నారు. పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూనే ఉన్నారు. నెల్లూరు నగరంలోని జనార్దన్‌రెడ్డి కాలనీ, నెల్లూరు రూరల్ ఏరియాలో పొట్టేపాళెం, కోవూరు నియోజకవర్గంలోని పోతిరెడ్డిపాళెం అన్ని ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది.

కలువాయి మండలంలో..

కలువాయి మండలం రాజుపాళెం ఇసుక దోపిడీకి రంగం సిద్ధం చేశారు. సోమవారం నుంచి పెన్నానదిలోకే రహదారి నిర్మాణం చేపట్టారు. రాజుపాళెం ఇసుక రీచ్‌కు నదిలోనే గ్రావెల్ తోలి రహదారి ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ నుంచి యంత్రాల ద్వారా ఇసుక లోడింగ్ చేసేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. కలువాయి తెలుగుగంగ కాలువ నుంచి గ్రావెల్‌ను పెన్నానదిలోకి తోలకం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే స్థానిక ఎమ్మెల్యే పేరు చెప్పి తమ్ముళ్ల బరి తెగిస్తున్నారు..

ఎన్‌జీటీ ఆదేశాలు.. అధికారులకు పట్టవా..

ఎన్‌జీటీ ఆదేశాల మేరకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు పెన్నా నదిలో ఇసుక తవ్వకాలు నిలిపివేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. కానీ ఎక్కడా ఆ ఉత్తర్వులు అమలు కావడం లేదు. ఈ విషయం కలెక్టర్‌కూ తెలుసు. జిల్లా సర్వోత్తమ అధికారిగా ఉన్న కలెక్టర్ ఆదేశాలకే దిక్కులేకుండా పోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇరిగేషన్, మైనింగ్, పోలీస్, విజిలెన్స్ అధికారులు మాత్రం తమకు నెలవారీ మామూళ్లు వస్తే చాలున్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ బహిరంగ దోపిడీ చూస్తే కలెక్టర్‌కు ఘోర అవమానమే.

సర్వేపల్లిలో ఇసుక రాబందులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సహజ వనరులు దోపిడీ చేశారంటూ అక్రమ కేసులు పెట్టి మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని జైల్లో పెట్టించిన స్థానిక ప్రజాప్రతినిధికి ప్రస్తుతం ఆయన అనుచర వర్గం చేస్తున్న జరిగే ఇసుక దోపిడీ మాత్రం కనిపించడం లేదు. సూరాయపాళెం డీసిల్టింగ్ పేరుతో నేరుగా పెన్నానదిలోనే యంత్రాలు పెట్టి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఇప్పటికే సూరాయపాళెం స్టాక్ యార్డులో 14 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాయం చేశారు. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి జేబులు నింపుకుంటున్నారు. తాజాగా విరువూరు ఇసుక రీచ్‌లో అనుమతులు లేకుండానే రాత్రి వేళల్లో యంత్రాలతో ఇసుక లోడింగ్ చేస్తూ బహిరంగ దోపిడీ చేస్తున్నారు. స్థానిక షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న నేత ఆధ్వర్యంలోనే ఈ దోపిడీ జరుగుతోంది. సూరాయపాళెం రెండో డీసిల్టింగ్ పాయింట్‌ను కూడా సంబంధిత కాంట్రాక్టర్ కప్పం కట్టలేక షాడో ఎమ్మెల్యేకు అప్పగించి వెళ్లిపోయినట్లు సమాచారం.



పొట్టేపాళెం నుంచి వరుసగా ట్రాక్టర్లు



మినగల్లు రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

ప్రశాంతమ్మా.. ఇదేనా అవినీతి రహిత పాలన



కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి అవినీతి రహిత పాలన అంటూ నిత్యం నీతులు వల్లిస్తోంది. కానీ తన నియోజకవర్గంలోనే అన్ని రంగాల్లో అవినీతే జరుగుతోంది. పోతిరెడ్డిపాళెంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. జొన్నవాడ, మినగల్లు నుంచి పోతిరెడ్డిపాళెం, పల్లిపాళెం వరకు నిత్యం భారీ స్థాయిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. కానీ ఎక్కడా అధికారులు అడ్డుకునే ప్రయత్నాలు చేయడం లేదు. గతంలో మినగల్లులో 12 వేల మెట్రిక్ టన్నుల ఇసుక మాయం చేసిన సంగతి తెలిసిందే. కానీ ఇప్పటి వరకు ఆ మాయమైన ఇసుక నగదు రికవరీ ఏమైందో ఇప్పటికీ చిదంబర రహస్యంగానే మిగిలిపోయింది.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి

- కూటమి పాలనలో దుర్భిక్షంలో ప్రజలు
- మాజీమంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి
- మా ప్రభుత్వం చేసిన అభివృద్ధిని కూటమి ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటు
- డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు

కోవూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన ఐదేళ్ల రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉన్నారని, ఇప్పుడు కూటమి పాలనలో ప్రజలు దుర్భిక్షంలో కొట్టు మిట్టాడుతున్నారని మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఏ ఊరికి వెళ్లినా ప్రజలు మా దగ్గరకు వచ్చి మా ఓట్లు వైఎస్సార్‌సీపీకే వేశామని, అయినా కూటమి ప్రభుత్వం వచ్చి, మా జీవితాలు దుర్భరంగా మారాయని కన్నీరు పెట్టుకుంటున్నారని ప్రసన్న ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోవూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మనస్సాక్షిగా ఇచ్చిన పథకం ఏ ఒక్కటీ లేదన్నారు. వైఎస్సార్‌సీపీ చేసిన నిరసనల ఫలితంగానే తల్లికి వందనం (అమ్మ ఒడి) డబ్బులు వేశారన్నారు. ఈ పథకం కూడా చాలా మందికి అందలేదన్నారు. చంద్రబాబు ఈవీఎంల ద్వారా సీఎం అయ్యారే కాని ప్రజలు ఇచ్చే తీర్పునకు కాదన్నారు. మా ప్రభుత్వ పాలనలో కోవూరు నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు నిధులు సమీకరించి అభివృద్ధి చేశామన్నారు. అదే ఈవీఎంల ద్వారా గెలిచిన ఎమ్మెల్యేకు అవగాహన లేకపోవడం, ఎవరో తెల్ల కాగితంపైన రాసి ఇచ్చిన దానిని చదవడం విచారకరమన్నారు. రాష్ట్రంలో 22 మంది ఎంపీలు ఉంటే దాదాపు 17 మంది ఎంపీలతోపాటు ఇతర రాష్ట్రాల ఎంపీల వద్ద నుంచి కూడా నిధులు తీసుకువచ్చి నియోకవర్గంలో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. అప్పటి మా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలతోపాటు అభివృద్ధి పనులు చేశారన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు.

ముదివర్తి– ముదివర్తిపాళెం కాజ్‌వే ప్రసన్నన్న కృషి ఫలితమే

ముదివర్తి– ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణం మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రన్నకుమార్‌రెడ్డి కృషి ఫలితమేని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఘనత అని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వీరిచలపతిరావు అన్నారు. ముదివర్తి– ముదివర్తిపాళెం కాజ్‌వే నిర్మాణం ఆవశ్యకతను అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ప్రసన్నన్న ఆ నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే మొదటి విడతగా రూ.92.32 కోట్ల నిధులతో కాజ్‌వే నిర్మాణానికి పనులు చేపట్టడం జరిగిందన్నారు.మా ప్రభుత్వంలో మేము చేపట్టిన ఈ పనిని కూటమి ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటన్నారు. కోవూరు నియోజకవర్గంలో కూటమి పాలనలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చేపట్టిన శాశ్వత ప్రయోజనకరమైన ఏదైనా ఒక ప్రాజెక్ట్ చేశామని నిరూపిస్తే తాము రాజకీయాల నుంచే తప్పుకుంటామన్నారు.

- నెల్లూరు– మైపాడు రోడ్డుకు రూ.48 కోట్ల అంచనాతో నిధులు మంజూరు చేయించారన్నారు. బుచ్చిరెడ్డిపాళెం ప్రజల దాహార్తి తీర్చేందుకు అమృత్ పథకం కింద రూ.85 కోట్లు నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. మరో రూ.45 కోట్లతోబుచ్చిరెడ్డిపాళెంలో సీసీ రోడ్డు, బీటీ రోడ్డుతో పాటు పార్కుల అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత మా ప్రభుత్వం, మా ప్రసన్నదేనని చెప్పారు. బుచ్చిరెడ్డిపాళెం-దగదర్తి రోడ్డు నిర్మాణ ఘటనత కూడా తమదే అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరం ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లప్రోలు విజయ్‌కుమార్, మండల కన్వీనర్లు శ్రీనివాసులురెడ్డి, అనూప్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, నాయకులు దినేష్‌రెడ్డి, నరసింహులురెడ్డి, సుబ్బారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, షాహుల్, రఫీ, జెడ్పీటీసీ శ్రీలత, ఉమ తదితరులు ఉన్నారు.

మా బిడ్డ మరణంపై అనుమానాలు నిగ్గు తేల్చాలి

- ఇంటర్ విద్యార్థి అనుమానాస్పద మృతి
- ఆ రోజు హాస్టల్ గదిలో ఒక్కడే నిద్ర
- తెల్లారే సరికి బాత్రూమ్‌లో ఉరేసుకుని విగతజీవిగా వేలాడిన వైనం
- హాస్టల్ నిర్వాహకుల తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం
- సెటిల్‌మెంట్ చేసుకుందామని తల్లిదండ్రులతో బేరసారాలు



విద్యార్థి రేవంత్ (ఫైల్)

నెల్లూరు సిటీ: తమ బిడ్డను ఉన్నత చదువులు చదివించేందుకు కుమారుడిని విడిచి దూరంగా ఉండలేకపోయినా తల్లిదండ్రులు హాస్టల్‌లో చదివిస్తున్నారు. అయితే హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం నేపథ్యంలో ఆ విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. నగరంలోని రామచంద్రాపురం మూడో వీధిలో నివాసం ఉంటున్న ఎస్.సాయిరామ్, కవిత దంపతుల కుమారుడు రేవంత్ (17)తోపాటు కుమార్తె ఉన్నారు. తండ్రి సాయి రామ్ చేజర్లలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరురూరల్ ఇన్‌స్పెక్టర్ వేణు ఘటనా స్థలానికి చేరుకుని హాస్టల్‌లో సీసీ కెమెరాలు పరిశీలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు మంచి సర్వీస్ ఇస్తున్నాం



స్పెస్ ఫ్రీ ఎడ్యుకేషన్ ఇస్తున్నాం. పిల్లలకు డాక్టర్స్‌తో తరచూ కౌన్సెలింగ్ క్లాసెస్ ఇస్తున్నాం. తల్లిదండ్రులు, పిల్లలకు మధ్య కూడా చిన్న చిన్న విషయాలు కూడా పరిష్కరిస్తున్నాం. ఆ రాత్రి కూడా తండ్రితో మాట్లాడాడు. ఒక్కడివే ఎందుకు స్నేహితులతో ఉండమని తండ్రి చెప్పాడు. అయినా పర్లేదు నాకు అలవాటే నాన్న అని చెప్పాడు. అయితే ఉదయానికి ఇలా ఉరేసుకున్నాడు.

– మల్లికార్జున, ప్రిన్సిపల్

యాజమాన్య నిర్లక్ష్యంతోనే మా కుమారుడి మృతి



మంగళవారం రాత్రి నా కుమారుడు రేవంత్ ఫోన్ చేసి ఎదురు రూమ్‌లో ఐదుగురు విద్యార్థులు రూమ్ మారుదామని చెబుతున్నారని, బూతులు కూడా తిడుతున్నారని, భయంగా ఉందన్నాడు. ప్రిన్సిపల్‌కు ఫోన్ చేసి చెప్పమన్నాడు. ఇన్‌చార్జికి చెప్పలేదా అని అడిగితే చెప్పాను పట్టించుకోవట్లేదని రేవంత్ చెప్పాడు. వెంటనే నేను ప్రిన్సిపల్‌కు ఫోన్ చెప్పాను. అయినప్పటికీ ప్రిన్సిపల్ పట్టించుకోలేదు. దీంతో కొద్దిసేపటికే రెండో సారి కూడా రేవంత్ ఫోన్ చేసి ప్రిన్సిపల్‌కు చెప్పావా నాన్న అని అడిగితే చెప్పాను.. ప్రిన్సిపల్ వచ్చి మాట్లాడుతానని చెప్పారని బదులిచ్చాను. ఈ క్రమంలో బుధవారం ఉదయం 8.30 గంటలకు కళాశాల నిర్వాహకులు ఫోన్ చేసి రేవంత్ ఉరేసుకున్నాడని, కొన ఊపిరితో ఉన్నాడని ఫోన్ చేశారు. అపోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లామని చెప్పాం. మా కుమారుడు కళాశాల నిర్వాహకుల వల్లే మృతి చెందారని ఆరోపించారు. ఈ విషయం మీడియాకు చెప్పొద్దని, సెటిల్‌మెంట్ చేసుకుందామని కళాశాల నిర్వాహకులు మా బంధువులతో బేరసారాలు చేశారని తల్లిదండ్రులు ఆరోపించారు. మా కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయి. తోటి పిల్లలే చేశారో.. యాజమాన్యం చేశారో పోలీసులే విచారించి న్యాయం చేయాలని కోరారు.

– రేవంత్ తండ్రి సాయిరామ్

ఘటపై సమగ్ర దర్యాప్తు చేయాలి

విశ్వసాయి హాస్టల్‌లో విద్యార్థి మృతిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయాలి. ప్రభుత్వ, బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్ అనుమతులు లేని కళాశాల అనుబంధంగా ఉన్న ప్రైవేట్ హాస్టల్స్ వెంటనే మూసివేయాలి. నిర్వహిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

– ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కమిటీ

విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలి



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి జేఏసీ నాయకులు

నెల్లూరు (టౌన్): స్థానిక ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వీఆర్సీ సెంటర్‌లో ధర్నా నిర్వహించి మాట్లాడారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఫీజులు, పుస్తకాల విక్రయాలపై ఉన్న శ్రద్ధ వారి భద్రతపై లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యార్థి మృతిపై విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హరీష్, బాలు, సాయి, మురళి, జనార్దన్, అబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పాట్లు

కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల రేషన్ తీసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధుల ఇళ్లకు వెళ్లి సరుకులు ఇవ్వాలని డీలర్లకు ఆదేశాలున్నా ఎక్కడా అమలు కావడం లేదు. నెల్లూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో రేషన్ దుకాణాల వద్ద సర్వర్లు పనిచేయక లబ్ధిదారులు గంటల తరబడి క్యూలైన్‌లో ఉండాల్సి వస్తోంది. పనులు మానుకుని వచ్చి అవస్థలు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



నెల్లూరు నాగేంద్రనగర్‌లో సర్వర్ పనిచేయకపోవడంతో వేచి ఉన్న లబ్ధిదారులు



నవాబుపేట ముకుందాపురంలో సర్వర్ పనిచేయకపోవడంతో వేచి ఉన్నారిలా..





రేషన్ బియ్యాన్ని మోసుకెళ్తున్న వృద్ధులు

చెడువ్యసనాలకు బానిసై నేరాలు

ముత్తుకూరు(పొదలకూరు): చెడువ్యసనాలకు బానిసై కత్తులు చూపించి చంపుతామని బెదిరిస్తూ నగదు, సెల్‌ఫోన్లను దోచుకెళ్తున్న వారిని ముత్తుకూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. కృష్ణపట్నం పోర్ట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవినాయక్ వివరాలను వెల్లడించారు. చిల్లకూరు మండలం, మోమిడి గ్రామానికి చెందిన మీదూరు రామయ్య, ఇదే మండలం తొణుకుమాలకు చెందిన బాలుడు గతనెల 30వ తేదీన ఏపీ జెన్కో రోడ్డులో బైక్‌పై వెళ్తున్న మేకల తిరుమలను అడ్డగించి మెడపై కత్తిపెట్టి సెల్‌ఫోన్, రూ.1,200 నగదు దోచుకున్నారు. ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి నిందితులను పట్టుకుని రూ.19,000 విలువైన ఒక సెల్‌ఫోన్, రూ.400 నగదు, రూ.70 వేల విలువైన స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన హెచ్‌సీ రామ్‌మోహన్, పీసీ పెంచలయ్య, సుమన్, వేణును నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు అభినందించి రివార్డు ప్రకటించినట్టు సీఐ తెలిపారు.

రొట్టెల పండగకు ఏర్పాట్లు

- ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు..
- రూ.3.5 కోట్లతో వసతులు
- మూడు షిఫ్ట్‌ల్లో 5 వేల మంది పారిశుధ్య కార్మికులు
- 14 పార్కింగ్ స్థలాల గుర్తింపు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు రొట్టెల పండగను నిర్వహించనున్నారు. రూ.3.5 కోట్లతో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పండగకు దేశం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. బారాషహీద్ దర్గా ప్రాంగణంలో 12 తాగునీటి స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు పెట్టారు. వర్షం వచ్చినప్పుడు తడవకుండా ఉండేందుకు షెడ్లపైన వాటర్ ప్రూఫ్ జింక్‌షీట్‌లు ఏర్పాటు చేశారు.

పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు

ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసేందుకు దాదాపు 14 పార్కింగ్ స్థలాలను గుర్తించారు. నగరంలోని పాత టీబీ హాస్పిటల్, సైన్స్ పార్కు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణం (బాలుర వసతి గృహం వెనుక), వైఎంసీఏ క్రీడా మైదానం, ఎన్టీఆర్ నగర్ సమీపంలోని వేణుగోపాలస్వామి కళాశాల ప్రాంగణం, పాత సీవీ రామన్ స్కూల్ ప్రాంగణం, జొన్నవాడకు వెళ్లే దారిలోని డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ ముందు వైపు, డీఎస్ఎన్ మినీ ఫంక్షన్ హాల్ వెనుక వైపు ఉన్న ఖాళీ ప్రాంగణం, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వెనుక వైపు (కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా) ఉన్న ఎగ్జిబిషన్ స్థలం, పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణం, వీఆర్సీ క్రీడా మైదానం, డీకేడబ్ల్యూ కళాశాల ప్రాంగణం, కస్తూర్బా గార్డెన్ వెనుకవైపు ఉన్న ప్రాంగణం, ప్రసార భారతి (ఆకాశవాణి) రేడియో కేంద్ర సమీపంలోని ప్రాంగణంతోపాటు అవసరం మేరకు పోలీసు అధికారులు సూచించే మరికొన్నిచోట్ల పార్కింగ్ స్థలాలు కేటాయించడం జరుగుతుంది. వాటి వద్ద కార్పొరేషన్ అధికారులు మొబైల్ టాయిలెట్స్, స్నానపు గదులు, తాగునీటి వసతి ఏర్పాట్లు చేస్తున్నారు. అంతే కాకుండా విద్యుత్ దీపాలు పెడుతున్నారు. సీసీ కెమెరాలు అమర్చనున్నారు. దర్గా ప్రాంగణంలో 40 సీసీ కెమెరాలతోపాటు మరో 5 పీటీజెడ్ కెమెరాలు, 2 డ్రోన్ల నిత్యం పరిశీలించనున్నారు. వాటిని పోలీస్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేయడం జరుగుతుంది.



బారాషహీద్ దర్గా



స్వర్ణాల చెరువు

ఏర్పాట్లు ఇలా..

బారాషహీద్ దర్గా ప్రాంగణంతోపాటు సమీప ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకున్నారు. మూడు షిఫ్టుల్లో పనిచేసేందుకు 5 వేల మంది కార్మికులను నియమించడం జరుగుతుంది. స్వర్ణాల చెరువు ఘాట్ వద్ద మోటార్లతో వాటర్ ప్యూరిఫై చేసే పనులు చేపట్టనున్నారు. దర్గా ప్రాంగణంతోపాటు కేవీఆర్ పెట్రోల్ బంక్, బట్వాడిపాళెం సెంటర్, పొదలకూరు రోడ్డు కూడలి వరకు రోడ్డుకిరువైపులా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా వీఐపీ రిసెప్షన్ కోసం ప్రత్యేకంగా టెంట్ వేస్తున్నారు. అన్నదానం చేసేందుకు మరో రెండు టెంట్లు వేయనున్నారు. ప్రత్యేకంగా పోలీస్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోంది.

నిత్యం సమీక్షిస్తున్నాం



రొట్టెల పండగకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. అన్ని శాఖల సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాం. దాదాపు రూ.3.5 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేశాం. నిత్యం అధికారులతో ఏర్పాట్లను సమీక్షిస్తున్నాం.

– వైఓ నందన్, కమిషనర్, నెల్లూరు నగరపాలక సంస్థ

అత్తమామల హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి(జలదంకి): ఉదయగిరి నియోజకవర్గం దుత్తలూరు ఏసీ కాలనీలో ఆదివారం అర్ధరాత్రి మద్యం మత్తులో అత్తమామలను హత్య చేసిన ఏలూరు వెంగయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం కావలి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పి.శ్రీధర్ వివరాలు వెల్లడించారు. వెంగయ్యకు వెంకాయమ్మ అనే మహిళతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు సంతానం ఉన్నారు. చేపల వేట, చిల్లకర్ర కొట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వెంగయ్య అత్తమామలు చలంచర్ల కల్లయ్య (62), చలంచర్ల జయమ్మ (59)లు వారింటి సమీపంలోనే ఉంటూ మేకలు కాస్తున్నారు. వెంగయ్య నిత్యం మద్యం మత్తులో ఉండేవాడు. అతను భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఆదివారం వెంగయ్య భార్యను పిట్టల వేటకు రమ్మని పిలవగా రాలేనని చెప్పింది. వేటకు వెళ్లి వచ్చిన అతడికి భార్య వేరేవారితో చేపల వేటకు వెళ్లినట్లు తెలిసింది. దీంతో వెంగయ్య భార్యపై మరింత అనుమానం పెంచుకుని పూటుగా మద్యం తాగాడు. అనంతరం భార్య తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉండగా అక్కడికి వెళ్లాడు. మచ్చు కత్తితో వెంకాయమ్మ వీపుపై నరికాడు. కుమార్తెను కాపాడాలని కల్లయ్య, జయమ్మ అడ్డు వెళ్లారు. వెంగయ్య భార్యను వదిలేసి అత్తమామలను కత్తితో విచక్షణారహితంగా నరికి చంపాడు. వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా నిందితుడు పరారయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసి వెంగయ్య కోసం గాలించారు. అతడిని లక్ష్మీపురం శివారులోని మిద్దెలబోడు కొండ – రామస్వామికుంట వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపిన కలిగిరి సీఐ వెంకట్రావ్, దుత్తలూరు, ఉదయగిరి ఎస్సైలు ఆదిలక్ష్మి, ఇంద్రసేనారెడ్డి, సిబ్బందిని అభినందించారు.

ట్రేడింగ్ పేరిట మోసం

- రూ.30.4 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

నెల్లూరు సిటీ: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో లాభాలు కురిపిస్తామని మాయమాటలు చెప్పి రూ.30.4 లక్షలను తమ అకౌంట్లకు సైబర్ నేరగాళ్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని మోసం చేశారు. దీనిపై నెల్లూరు చిన్నబజార్ పోలీసులను బాధితుడు ఆశ్రయించాడు. బుధవారం వారు వివరాలు వెల్లడించారు. డైకస్‌రోడ్డులో గల హల్తాలీం మసీద్ వీధిలో మతీన్ ఫైజాన్ నివాసం ఉంటున్నారు. బీటెక్ తర్వాత ఓ కంపెనీలో పనిచేసి, ఐదు నెలలుగా ఇంటి వద్దే ఉంటూ కొత్త ఉద్యోగం కోసం అన్వేషణలో ఉన్నాడు. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సంబంధించిన ఓ లింక్ మే ఐదున వచ్చింది. దానిని క్లిక్ చేయగా, వాట్సాప్ నంబర్‌కు గుర్తుతెలియని నంబర్ల నుంచి ఫోన్లొచ్చాయి. ఆయా నంబర్ల నుంచి ఇషితా మెహతా అనే పేరుతో చాటింగ్ చేశారు. వారానియమ్ కంపెనీకి చెందిన వారిమని పరిచయం చేసుకుని, ఆన్‌లైన్ మార్కెటింగ్ సంబంధించి సూచనలు, సలహాలిచ్చి లాభాలొచ్చేలా చూస్తామని నమ్మబలికారు. బాధితుడికి కొన్ని లింక్‌లు పంపి వివరాలను నమోదు చేయాలని సూచించారు. కొన్ని స్టాక్ ట్రేడింగ్‌లో వారి సూచనల మేరకు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేసి కొనుగోలు, అమ్మకాలు చేశారు. ఇలా సుమారు రూ.1.25 లక్షల లాభాన్ని పొందారు. దీంతో నమ్మకం రావడంతో అప్పులు చేసి, ఇంట్లోని బంగారాన్ని తాకట్టు పెట్టి వారి అకౌంట్‌కు పలు దఫాలుగా రూ.30.4 లక్షలను డిపాజిట్ చేశారు. వారానియమ్ ప్రో యాప్ అకౌంట్‌కు రూ.2.29 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు చూపారు. గత నెల 27న విత్‌డ్రా చేసేందుకు విఫలయత్నం చేశారు. దీంతో కస్టమర్ కేర్‌తో చాటింగ్ చేయగా, విత్ డ్రా చేసేందుకు ప్రాసెసింగ్‌లో భాగంగా రూ.30 లక్షలను డిపాజిట్ చేయాలని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆయన ఎన్సీఆర్పీ పోర్టల్లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యులను అరెస్ట్ చేయడం దుర్మార్గం



మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నెల్లూరు (అర్బన్): విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసుకుని శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులను కూటమి ప్రభుత్వం అరెస్ట్ చేయడం దుర్మార్గమని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ అన్నారు. యువ వైద్యుల అరెస్ట్‌ను నిరసిస్తూ బుధవారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరికి ఆ సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ ఎన్నో కష్టాలు పడి అప్పులు చేసి విదేశాల్లో చదివి పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో డాక్టర్ అయిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌ను పర్మినెంట్ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇవ్వమని కోరారన్నారు. గత 13 నెలలుగా రిజిస్ట్రేషన్ కోసం శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. ఈ నేపథ్యంలోనే మెడికల్ కౌన్సిల్ కార్యాలయం వద్దకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం వచ్చిన యువ వైద్యులను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు ఆశిర్, నాయకులు చరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

4న నిరుద్యోగులకు శిక్షణ

నెల్లూరు (పొగతోట): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సీడాప్ సెంచూరియన్ యూనివర్సిటీ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ద్వారా ఎంటర్‌ప్రైజెస్ ఆధారిత శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైలట్ ప్రాజెక్ట్ కింద నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఎంపిక చేశామన్నారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని డీఆర్‌డీఏ కార్యాలయం జాబ్స్ విభాగంలో ఓరియెంటేషన్ ప్రోగ్రాం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు మంజూరు చేస్తారని, ఆసక్తి ఉన్న వారు యూనిట్లను ఎంపిక చేసుకోవాలని తెలిపారు.

రైల్లో నుంచి పడి వ్యక్తి మృతి



మనుబోలు: మనుబోలు – గూడూరు మధ్య రైల్వే డౌన్‌లైన్‌పై 139/18 – 20 కిలోమీటర్ వద్ద బుధవారం ఓ వ్యక్తి రైల్లో నుంచి పడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నారు. మృతుడు గ్రే కలర్ షర్టు ధరించి ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.20
పండ్లు : రూ.8